క్లుప్తంగా

శ్రీకాళహస్తిలో దళారీల దందా



సమావేశంలో మాట్లాడుతున్న యోగానంద్

తిరుపతి కల్చరల్ : శ్రీకాళహస్తిలో దళారీల దందాను అరికట్టాలని పట్టణానికి చెందిన యోగానంద్ విన్నవించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి విచ్చేసే భక్తులను లాడ్జిల్లో గదుల బుకింగ్ పేరిట దళారీలు యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఆరోపించారు.పూర్ణేష్ అనే వ్యక్తి తన స్థలంలో డార్మెటరీ నిర్మించి యాత్రికులకు కేవలం రూ.100లకే బెడ్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. అయితే స్థానికంగా 10 లాడ్జిలను నిర్వహించే ఓ వ్యక్తి తన స్వార్థం కోసం డార్మెటరీపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే కమీషన్ ఏజెంట్లు సిండికేటుగా ఏర్పడి అక్టోబర్ 18వ తేదీన తమపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రాలు అందించామని వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి శ్రీకాళహస్తిలో దళారీల ఆగడాలను అడ్డుకోవాలని కోరారు.

శుక బ్రహ్మాశ్రమంలో భాగవత పారాయణం



శుక బ్రహ్మాశ్రమంలో చేస్తున్న భాగవత పారాయణం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుక బ్రహ్మాశ్రమంలో బుధవారం మహా భాగవత పారాయణం చేశారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఈ నెల 15న ఈ పారాయణం ముగుస్తుందని చెప్పారు. ఒంగోలుకు చెందిన చిన్మయ మిషన్ అధిపతి సత్యాత్మనందస్వామి ఆధ్వర్యంలో భాగవత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా గోపి



గోపి

బుచ్చినాయుడుకండ్రిగ: హౌసింగ్ ఏఈగా గోపి బుధవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న సుబ్రమణ్యం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో గాజులపెళ్లూరు గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపిని ఇన్‌చార్జ్ ఏఈగా నియమించారు. సకాలంలో హౌసింగ్ బిల్లులను చెల్లించి, పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేస్తానని ఆయన తెలిపారు.

ఆగమోక్తంగా ఆకాశ దీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాశ దీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సాంప్రదాయబద్ధంగా వెలిగించడం పరిపాటి. ఆలయంలోని ఉయ్యాలసేవ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ హఠాన్మరణం



కామేశ్వరి

శ్రీకాళహస్తి: మండలంలోని వెలంపాడు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కామేశ్వరి బుధవారం హఠాన్మరణం చెందారు. ఆమె మృతికి ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం అప్పగింత

సత్యవేడు: కొల్లడంలో అక్రమంగా దాచి ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు బుధవారం అప్పగించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు తరలించినా, అలాగే శ్రీసిటీ పరిధిలో బెల్టుషాపులు నిర్వహించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాళహస్తి: గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని గ్రంథాలయాధికారి లావణ్య తెలిపారు. తొలిరోజు బాలల దినోత్సవం పురస్కరించుకుని గ్రంథాలయం, పుస్తకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 20వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు.





వరదయ్యపాళెం హైస్కూల్‌లోని అటల్ టింకర్ ల్యాబ్‌లో రైడ్ సేఫ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్న విద్యార్థులు, రైడ్ సేఫ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టును రూపొందించిన వరదయ్యపాళెం హైస్కూల్ విద్యార్థులు



సృజనశీలురు

- కృషి, ప్రోత్సాహంతో పలు రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు
- నూతన ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలకు నాంది

వరదయ్యపాళెం: కృషి, ప్రోత్సాహం పిల్లల్లో సృజనాత్మకతను ఉద్దీపనం చేస్తుంది. వారి పట్టుదలకు ప్రోత్సాహాన్నిస్తే నూతన ఆలోచనల వైపు అడుగులేస్తారు. బాలల హక్కుల రక్షణ, వారికి మంచి విద్యనందివ్వడం, శ్రేయస్సుకు పాటుపడడంతో పాటు పోషకాహారం, ఇంట్లో సురక్షితమైన వాతావరణం కల్పిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని సత్యవేడు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు నిరూపిస్తున్నారు. పలునూతన ఆవిష్కరణతో తమ సృజనాత్మకత శక్తిని చాటుతున్నారు.

పై చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులు వరదయ్యపాళెం ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నారు. 9వ తరగతికి చెందిన జి.మునిగణేష్, పి.కార్తీక్, పి. వరుణ్, కె.భవిత్, 8వ తరగతికి చెందిన పి. వజిని, కె.గాయత్రి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువకులు నిత్యం రోడ్డుపై బైకు యాక్సిడెంట్‌లకు గురవుతున్నారు. ప్రధానంగా బైకు నడిపేటప్పుడు కొంత మంది మొబైల్ మాట్లాడుతూ.. ఒక చేతితో బైకు నడుపుతుంటారు. ఈ కారణంగానే ప్రమాదాల బారిన పడుతుంటారు. అయితే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రైడ్ సేఫ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టు ద్వారా బైకు హ్యాండిల్‌పై చేతులు తీసిన వెంటనే బైకు ఆగిపోయేలా వీరు ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు జర్మనీకి చెందిన సీడ్ ద ఫ్యూచర్ ప్రోగ్రాం (డిజాల్ట్) కంపెనీ వారు పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయడం, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక సమస్యలను గుర్తించడంలో భాగంగా రాష్ట్రంలో 4 పాఠశాలలు ఎన్నిక కాబడ్డాయి. అందులో వరదయ్యపాళెం హైస్కూల్ ఎంపికైంది. వీరు చేపట్టిన రైడ్ సేఫ్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ జాతీయస్థాయి ఫైనల్ రౌండ్‌కు ఎన్నికైంది. దీంతో విద్యార్థులు పలువురు నుంచి ప్రశంసలు అందుకున్నారు.

కథలు చదవడం నాకిష్టం



పూర్వపు కలెక్టర్, సంయుక్త కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి ఇషాంత్ (ఫైల్)

మా పాఠశాల గ్రంథాలయంలోని కథల పుస్తకాలతో పాటు నాకు పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో వచ్చిన బహుమతుల కథల పుస్తకాలు చదివి నేను కథలు రాయగలిగాను. ఈ కథలు రాసేటప్పుడు ఎంతగానో సంతోషం వేసింది. ఇప్పటివరకు అలా నేను తెలివైన రాజకుమారుడు, అత్యాశ దోమలు, చిలుక తెలివి, పావురాల తెలివి..కథలు రాశాను. ఈ కథలు బాలనేస్తాల పుస్తకంలో ప్రచురించారు. ఈ కథలతో ఎన్నో బహుమతులు అందుకున్నాను. రాబోయే రోజుల్లో మరిన్ని కథలు రాసి అందరినీ మెప్పిస్తాను.

-ఇషాంత్, 9వ తరగతి, కల్లివెట్టు హైస్కూల్

ఊహలతో ఆమె కథలు



బీఎన్‌కండ్రిగ మండలం కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని సృజని తన ఆలోచనలు, ఊహలతో కథలు రాయడంలో దిట్ట. అక్కాచెల్లెలు, గుణపాఠం, కూరగాయల రైతు, రాజెవరూ? తదితర కథలు ఇప్పటివరకు రాసింది. ఆ కథలను బాలనేస్తాల పుస్తకంలో సైతం ప్రచురించారు. ఆమె కథలు రాయడానికి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి ప్రోత్సాహమే ప్రధాన కారణం. చిన్న వయసులో కథలు రాసిన విద్యార్థినికి ఇటీవల పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శతావధాని ఆముదాల మురళి నుంచి సన్మానం అందుకుంది.

'అమర రాజా'కు 12 బంగారు పతకాలు



బంగారు పతకాలతో అమరరాజ ప్రతినిధులు

రేణిగుంట: శ్రీలంక దేశం కొలంబోలో మంగళవారం జరిగిన 49వ అంతర్జాతీయ స్థాయి క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ పోటీల్లో రేణిగుంట మండలం కరకంబాడి వద్ద ఉన్న అమరరాజ సంస్థ నుంచి పాల్గొన్న 12 బృందాలకు 12 బంగారు పతకాలు లభించినట్లు సంస్థ యాజమాన్యం బుధవారం వెల్లడించింది. 14 దేశాల నుంచి 800 బృందాలు పాల్గొన్నారని తెలిపింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గొరినేని మాట్లాడుతూ మహోన్నత విజయాలనేవి ఎప్పుడు కూడా ఉమ్మడి లక్ష్యం దిశగా కలిసికట్టుగా పనిచేసినప్పుడే వరిస్తాయన్నారు. క్వాలిటీ సర్కిల్ బృందంలోని ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.నరసింహులునాయుడు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ మల్లిగుంటలో పొలాల వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగివైరును చోరీ చేశారు. వీటి పరిధిలో రైతులు సుమారు 60 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు సీజన్ కావడంతో వారు లబోదిబో మంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు చోరీకి పాల్పడిన దుండగులను అరెస్టు చేయాలని వారు కోరుతున్నారు.

తెప్పపై కల్యాణ వేంకటేశ్వరుడి విహారం



తెప్పపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న



శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్న

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. 9 గంటలకు ఉభయ నాంచారుల సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులకు కల్యాణ మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం తిరుచ్చి వాహనంపై అధిష్టించిన ఉత్సవమూర్తులు మేళ తాళాలు, భక్తుల కోలాటాల నడుమ పద్మసరస్సుకు చేరుకుని తెప్పపై అధిష్టించారు. సరస్సులో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆ తర్వాత ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య ఆస్థానం, ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, భరత్, షనాయ్, భద్రతా జమేదార్ మల్లిఖార్జున ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాలుగవ రోజు గురువారం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు

● పరామర్శ



ఉదయ్ కుమార్ రెడ్డిని పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: స్థానిక వైస్ ఎంపీపీ కుమారి భర్త, వైఎస్సార్ సీపీ నేత ఉదయ్ కుమార్ రెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చారు. ఇది తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ బుధవారం నాగలాపురంలోని ఉదయ్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు శ్యామ్, మురళి, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, కార్యకర్తలు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కొలతలు వేసి ఇనుప కంచెను తొలగిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీయస్‌పురం గ్రామ పంచాయతీ వేణుగోపాలపురంలోని శ్మశానానికి వెళ్లే రోడ్డు, పంట కాలువ ఆక్రమణలను వీఆర్‌ఓ ఈశ్వరయ్య తొలగించారు. బుధవారం సాక్షి దినపత్రికలో ×ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు÷ శీర్షికతో ప్రచురించిన కథనంపై తహసీల్దార్ సుబ్రమణ్యం స్పందించారు. ఆయన ఆదేశాలతో వీఆర్‌ఓ ఈశ్వరయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు ఆక్రమణల ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. భూమి కొలతలు వేసి, శ్మశానానికి వెళ్లే రోడ్డును, పంట కాలువను ఆక్రమించి వేసిన ఇనుప కంచెను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డాబాలో డీఎస్పీ తనిఖీ



తనిఖీలు చేస్తున్న డీఎస్పీ మూర్తి

-పోలీస్ స్టేషన్‌కు యువకులకు కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ దాబాను డీఎస్పీ కె.ఎస్. మూర్తి బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ మద్యం సేవిస్తున్న కొందరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దాబా యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆలయ సమీపంలో న్యూసెన్స్ చేస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ తరలించారు. చదువుకోవాల్సిన వయసులో జులాయి పనులు చేస్తే జీవితాంతం బాధ పడాల్సి వస్తుందని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ గోపి, పోలీసులు పాల్గొన్నారు.

విజయవాడలో అవమానం..తిరుపతిలో సత్కారం!



కయ్యూరు బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న కలెక్టర్, డీఈఓ

శ్రీకాళహస్తి : అవార్డుల ప్రదానం పేరిట కొందరు ఉపాధ్యాయులను అవమానానికి గురిచేసిన కూటమి ప్రభుత్వం తీరుపై ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. విజయవాడ నుంచి అవమాన భారంతో ఇళ్లకు చేరిన ఉపాధ్యాయులకు ఎట్టకేలకు అవార్డు పేరిట జిల్లా కేంద్రాల్లో సత్కరించి, మమ అనిపించి, వారికి ఊరటనిచ్చింది. టీచర్లలో ఆగ్రహం చల్లార్చే ప్రయత్నం చేసింది. వివరాలు.. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి, విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డుల ప్రదానానికి ఆహ్వానించడం విదితమే. తిరుపతి జిల్లా నుంచి ఉత్తమ టీచర్‌గా ఎంపికైన వారిలో తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన కయ్యూరు బాలసుబ్రమణ్యం కూడా ఉన్నారు. విద్యాశాఖ ఆహ్వానం మేరకు అవార్డు స్వీకరించేందుకు ఆయన కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా విజయవాడకు వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక విద్యాశాఖ ఆయనకు షాక్ ఇచ్చింది. గుమస్తా చేసిన తప్పిదంతో పొరబాటున అవార్డు ప్రకటించినట్లు అక్కడ అధికారులు చెప్పడంతో ఆయన హతాశులయ్యారు. అవమాన భారంతో ఇంటికి చేరుకున్నారు. ఇలా రాష్ట్రంలో ఏడుగురికి విజయవాడలో చేదు అనుభవం ఎదురైంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం తీరుపై మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ స్పందించి దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం అవార్డు స్వీకరించాలని విద్యాశాఖ నుంచి పిలుపురావడంతో విస్తుపోవడం ఆయన వంతైంది. ఈ పరిణామాల క్రమంలో బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఈఓ కేవీఎన్ కుమార్ ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ప్రశంసా పత్రంతో సన్మానించారు.

నీతి అయోగ్ సీఈఓకు స్వాగతం




నీతి అయోగ్ సీఈఓకు స్వాగతం పలుకుతున్నకలెక్టర్

రేణిగుంట: తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యానికి బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ అధికారులు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు

ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌కు ..

అలాగే న్యూఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్, విమానాశ్రయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు. అలాగే త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని ఇక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో తిరుమలకు వెళ్లారు.

ఆధార్‌లో తప్పులు సరిచేయలేదని నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గిరిజన కాలనీకి చెందిన గంగమ్మ బుధవారం ఆధార్ కార్డులోని తప్పులను సరిచేయడం లేదని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ, తన ముగ్గురు పిల్లలు పాఠశాలలో చదువుతున్నారని, పిల్లల అపార్ కోసం ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోవాలని బుచ్చినాయుడుకండ్రిగలోని ఆధార్ కేంద్రానికి పలుమార్లు వచ్చిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

18న ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ధర్నా

వరదయ్యపాళెం: రాష్ట్ర సీపీఐ అధిష్టానం పిలుపు మేరకు పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ఈ నెల 18న రాష్ట్ర సచివాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో తెలిపిన మేరకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలను అర్హత కలిగిన వారికి పంపిణీ చేయాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం ఆ పార్టీ నేతలు వరదయ్యపాళెంలో కరపత్రాలను పంపిణీ చేసి కార్యక్రమ విజయవంతానికి పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు బుర్రా చంద్రశేఖర్, తరుణ్, సిద్ధలయ్య, నాగార్జున, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ దుర్మరణం



విగత జీవిగా పడిఉన్న యశోద

రేణిగుంట: పశువుల మేత కోసం పొలంలోని గడ్డివామి నుంచి గడ్డి మోపును తీసుకొస్తూ పొలంగట్టు అనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే ఓ వివాహిత దుర్మరణం పాలైన ఘటన ఏర్పేడు మండలం బండారుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని బండారుపల్లికి చెందిన చెన్నంపల్లి మురళి భార్య యశోద(35) బుధవారం మధ్యాహ్నం పొలాల్లోని గడ్డివాము నుంచి ఎండుగడ్డిని మోపు కట్టుకుని నెత్తిన పెట్టుకుని ఇంటికి బయల్దేరింది. మార్గం మధ్యలో పొలం గట్టున నడిచి వస్తుండగా, సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు నెత్తిన ఉన్న గడ్డిమోపు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.